క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఆపరేషన్స్ పీ హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పోరంకి గ్రామంలోని సాలిపేట రోడ్డు, పెనమలూరు సెంటర్, ఏవీఎం గార్డెన్స్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అనధికార నిర్మాణంపై చర్యలు

పెనమలూరు: యనమలకుదురులో అనధికార నిర్మాణంపై తాడిగడప మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని డొంకరోడ్డులో ఓ బిల్డర్ అనధికారికంగా పెంట్‌హౌస్ నిర్మాణం చేపట్టడంతో భవనం శ్లాబ్‌కు టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నాలు వేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనధికార నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ పీ భవానిప్రసాద్ హెచ్చరించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



గన్నవరం: మండలంలోని సావరగూడెం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అట్లా నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం 1,700కు పైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. జీవాలు నట్టల వ్యాధి బారిన పడకుండా ముందస్తు నివారణ జాగ్రత్తలు తీసుకోవాలని ముస్తాబాద వెటర్నరీ డిస్పెన్సరీ డాక్టర్ మేరి వైడూర్యం సూచించారు. వెటర్నరీ కళాశాల డాక్టర్స్ టీ శ్రీనివాసరావు, జీ కమలాకర్, సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పెనమలూరు: డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని ఎంపీడీఓ బండి ప్రణవి తెలిపారు. సోమవారం ఆమె వివరాలు తెలుపుతూ ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు టెట్ అర్హత సాధించాలని, బీసీ, ఈబీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ కులాలకు చెందిన వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్ ఉత్తీర్ణత పత్రాలు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

కంకిపాడు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వీ భావనారాయణ ఆదేశించారు. సమ్మర్ వాటర్ స్టోరేజ్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా మంచినీటి ట్యాంకుల నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి సరఫరా అంశాలపై చర్చించారు. వేసవి చలివేంద్రాల ఏర్పాటుపై ఆరా తీశారు. తహసీల్దార్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. పశువులకు నీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ బసవయ్య, ఈఓపీఆర్డీ కిరణ్మయి పాల్గొన్నారు.

నైతిక విలువలు అవసరం



ముస్తాబాద(గన్నవరం): క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని ముస్తాబాదలో ఉన్న నవభారత్ హైస్కూల్ వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఏకపాత్రాభినయం, కామెడి స్కిట్లు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, వీసీఎస్ అండ్ టీఏ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్, ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి జరిమానా

ఉంగుటూరు(గన్నవరం): దాడి కేసులో నిందితుడికి రూ. 8 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్ సమాచారం మేరకు.. చాగంటిపాడుకు చెందిన అప్పికట్ల శ్రీనివాసరావుకు చెందిన 1.55 ఎకరాల పొలాన్ని అదే గ్రామానికి చెందిన పూల సాంబశివరావు గత 12 ఏళ్లుగా కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం పొలం విషయమై సాంబశివరావుకు, శ్రీనివాసరావుకు మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసరావు చేతిలో ఉన్న కొడవలితో సాంబశివరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో సాంబశివరావు కుడి చేతికి తీవ్రగాయం కావడంతో ఉంగుటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గన్నవరం కోర్టులో ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాసరావుకు జడ్జి బీ శిరీష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పేదోడి సొంతింటిపై శీతకన్ను

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రుణాలు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- ఏడాదిగా రుణాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు



బాపులపాడులో ముళ్ల చెట్లతో నిండిన జగనన్న కాలనీ రెండో లే అవుట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదవాడికి సొంతింటి కల అందని ద్రాక్షలా మారింది. ఎన్నో ఏళ్లుగా గూడు లేక ఇబ్బందులు పడుతున్న అర్హులైన పేదలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. అంతేకాక ప్రతి లబ్ధిదారునికి ఇళ్ల పట్టాలను ఇవ్వడంతోపాటుగా వారి పేరిట గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు కూడా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు, రుణాల మంజూరు ప్రక్రియను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నారు.

లబ్ధిదారులపై నిర్లక్ష్య ధోరణి

బాపులపాడు మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతలుగా దాదాపు ఐదు వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. వీరిలో 3,300 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, రుణాలను కూడా మంజూరు చేశారు. వీటిలో 1,300 ఇళ్లు పూర్తి కాగా, మరో 1,200 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నారు. వివిధ కారణాలతో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. దాదాపు 800 మంది లబ్ధిదారులకు గతంలోనే గృహ రుణాలు మంజూరు అయినప్పటికీ, ఇంకా ఇంటి నిర్మాణం ప్రారంభించలేదనే నెపంతో ఆ రుణాలను రద్దు చేశారు. అంతేకాక మలి విడతలో పలు గ్రామాల్లో దాదాపు 1,200 మందికి మంజూరు చేయాల్సిన గృహ నిర్మాణ రుణాలను కూడా పూర్తిగా నిలిపివేశారు. అంతంత మాత్రం ఆర్థిక పరిస్థితుల్లో అద్దె ఇంట్లో నివసిస్తున్న తమ జీవితాలు సొంతిల్లు ఏర్పాటుతో బాగుపడతాయని భావించిన పేదలు కూటమి ప్రభుత్వ చర్యలతో ఉసూరుమంటున్నారు.

పిచ్చిమొక్కలతో కళావిహీనంగా లేఅవుట్లు

పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో జగనన్న కాలనీల పేరిట లే అవుట్లను ఏర్పాటు చేశారు. ఆ లేవుట్లలో ప్లాట్లు విభజించి లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో పాటుగా పట్టాలు ఇచ్చి, రిజిస్ట్రేషన్లు కూడా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం రాకతో పేదల ఆనందం అటకెక్కింది. గత పది నెలలుగా జగనన్న లే అవుట్లలోని ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలకు రుణాలు, అనుమతులు మంజూరు చేయకపోవడం, కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోకపోవడంతో ఆ స్థలాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. నాడు ప్లాట్లు విభజనతో కళకళలాడిన లే అవుట్లు నేడు పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో దర్శనమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కరుణించి ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

ముగిసిన పోషణ పక్వాడా పక్షోత్సవాలు



ఉయ్యూరులో గర్భిణులకు సారె అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని, కమిషనర్ పాయసం

గన్నవరం: ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గత పదిహేను రోజులుగా జరుగుతున్న పోషణ పక్వాడా జాతీయ పక్షోత్సవాలు మండల స్థాయిలో సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు ఇంటి వద్ద లభించే చిరుధాన్యాలతోపాటు అంగన్‌వాడీల్లో సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భస్థ దశ నుంచే మహిళలు మంచి ఆహార, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ టీ స్వర్ణలత సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. సీడీపీఓ పీ వెంకటలక్ష్మి, ఎంఈఓ–2 ఎం. కమల, ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు, పలువురు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

కంకిపాడు: పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది గర్భిణులకు చీర, సారె అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు అందించే ఆహారాన్ని ఇంటిలోనే తయారు చేసుకుని భుజించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ భావనారాయణ, సీడీపీఓ కేబీ సుకన్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ బసవయ్య, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ నిఖిత, సూపర్‌వైజర్ ఎస్ అన్నామణి, శ్రీలత, నీరజ, ఏ శివపార్వతి, కంకిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలో సామూహిక సీమంతాలను సోమవారం వేడుకగా నిర్వహించారు. ఐసీడీఎస్, మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేసి చీర, సారె అందించారు. అనంతరం పోషకాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



కంకిపాడులో గర్భిణులకు సీమంతం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గన్నవరంలో సామూహిక సీమంతాలు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

● ఆదమరిస్తే ప్రమాదమే



కంకిపాడు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఉన్న గొయ్యి

నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం కూడా ఉంది. కార్యాలయ ప్రాంగణంలో వ్యర్థ నీరు పోయేందుకు వీలుగా సుమారు ఐదు అడుగులకు పైగా లోతు గొయ్యి తవ్వి, సిమెంటు వరలు వేశారు. అయితే దీనిపై మూత మాత్రం వేయలేదు. ఆదమరిస్తే గోతిలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సిమెంటు వరలపై మూత ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – కంకిపాడు

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి

గన్నవరం: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి ముస్లింలకు రక్షణ కల్పించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నూర్‌బాషా, దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిమర్తి చిన్నమస్తాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం వల్ల ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ చట్టం వల్ల వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ముస్లిం హక్కులకు భంగం కలిగించే ఈ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే ఈ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతోపాటు రద్దు చేసే వరకు న్యాయపోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీతో పాటు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చిన టీడీపీ, జనసేన, ఇతర పార్టీలకు ముస్లిం సమాజం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

దళిత కుటుంబాల సాంఘిక బహిష్కరణపై నిరసన



గన్నవరంలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నేతలు

గన్నవరం: పిఠాపురం నియోజకవర్గంలోని మలాం గ్రామంలో దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడాన్ని నిరసనగా కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకుడు మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత సమాజంలో ఇంకా దళితుల పట్ల చిన్నచూపు, కుల బహిష్కరణలు జరగడం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తూ డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటనపై ఆయన బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని దళితుల పట్ల కుల వివక్షతతో వ్యవహరించిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు కళ్లం రాంబాబు, ఏసుబాబు, ఆంథోని, గుండిమెడ ఉదయభాస్కరరావు, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

కంకిపాడు: ఈడా సాంబమూర్తి శ్రీ రామచంద్ర సొసైటీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు, శుక్లాల ఆపరేషన్లు, కళ్లజోళ్ల అవసరంపై పరీక్షలు చేశారు. 110 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని సొసైటీ సలహాదారుడు యార్లగడ్డ బుల్లయ్య పర్యవేక్షించారు.

గీతా మందిరంలో ముగిసిన మహాసంప్రోక్షణ కుంభాభిషేకం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని గీతా మందిరంలో మూడు రోజుల పాటు జరిగిన మహాసంప్రోక్షణ కుంభాభిషేకం శ్రీ శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనంతో సోమవారం ముగిసింది. తిరుపతి యేర్పేడు శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఉత్తరాధికారి శ్రీ అనంగా నందగిరిస్వామి, వేద పండితుడు రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో వైదిక సంప్రదాయాలను పాటిస్తూ వేద పండితులు శ్రీనివాస కల్యాణ మహదాశీర్వచనం నిర్వహించారు. గీతా మందిరంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడికి విశేష అలంకారాలు చేసి పవిత్రమైన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనంతో పాటు శ్రీకృష్ణునికి నైవేద్యాలు సమర్పించే అవకాశం కల్పించారు. శ్రీ గీతామందిర మహాసంప్రోక్షణ కుంభాభిషేకం ముగిసిన అనంతరం శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి విశ్వాసం, ధర్మం, భక్తి శక్తి అనే అంశాలను ఉద్ఘాటిస్తూ స్ఫూర్తిదాయకమైన భక్తి ప్రసంగాన్ని అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల తహసీల్దారు బీ సుగుణ, నున్న పోలీసు స్టేషన్ సీఐ పీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేల.. అదిరిపోలా



రేల చెట్టు నిండుగా పువ్వులతో అలరిస్తోంది. గుత్తులుగా పువ్వులు విరబూసి ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. గోసాల సెంటరులోని ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లే మార్గంలో ఉన్న రేల చెట్టును చూసి అందరూ రేల.. అదిరిపోలా.. అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. – కంకిపాడు

విద్యార్థులకు బహుమతులు అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

కంకిపాడు: మండలంలోని మద్దూరు ఎంపీపీ స్కూల్ ఆవరణలో పాఠశాల స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.స్వప్నకుమారి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిప్పల రామదాసు మాట్లాడుతూ విద్యతో పాటు ఉన్నత విలువలు కూడా నేర్చుకోవాలని సూచించారు. హెచ్‌ఎం స్వప్నకుమారి మాట్లాడుతూ పాఠశాల మోడల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యిందని చదువుతో పాటుగా విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా బోధన సాగుతుందన్నారు. పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ చిప్పల కీర్తి, వైస్ చైర్మన్ కూనపరెడ్డి సునీత, కృష్ణవేణి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు నూజివీడు న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వీరవల్లి ఎస్‌ఐ శ్రీనివాసు సోమవారం తెలిపారు. గతేడాది మార్చి 20వ తేదీన బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తిని కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనపై శేరినరసన్నపాలెం వీఆర్‌వో జే సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ కొక్కిలిగడ్డ మహేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై నూజివీడు న్యాయస్థానంలో విచారణ పూర్తి కావడంతో ముద్దాయి కొక్కిలిగడ్డ మహేష్‌కు 15 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసు తెలిపారు.

బాలుడిపై వీధికుక్క దాడి

తేలప్రోలు(గన్నవరం): రోడ్డుపై ఆడుకుంటున్న బాలుడిపై వీధికుక్క దాడిచేసిన సంఘటన ఉంగుటూరు మండలం తేలప్రోలులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని హరిజనవాడకు చెందిన చౌటపల్లి బుజ్జిబాబు అనే బాలుడిపై వీధి కుక్క దాడి చేసింది. బాలుడి పైదవులను గట్టిగా కొరికివేయడంతో కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారు కుక్కను తరిమికొట్టారు. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో ఇటీవల వీధికుక్కల సంచారం పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామవరప్పాడులో కార్డన్ సెర్చ్



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ కేజీవీ సరిత, సెంట్రల్ ఏసీసీ కే దామోదరరావుతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీసీపీ సరిత మాట్లాడుతూ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీయడం జరిగిందన్నారు. అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఇకపై నిత్యం ముఖ్య ప్రదేశాల్లో కార్డన్ సెర్చ్, ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సింగన్నగూడెం వీఆర్‌ఏగా అనుకీర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం సింగన్నగూడెం గ్రామ రెవిన్యూ అసిస్టెంట్(వీఆర్‌ఏ)గా నక్కా అనుకీర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బీ మురళీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది డిసెంబర్‌లో సింగన్నగూడెం వీఆర్‌ఏ నక్కా శివన్నారాయణ అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో కారుణ్య నియామక మార్గదర్శకాల కింద ఆయన కుమార్తె అనుకీర్తిని తాత్కాలిక ప్రాతిపదికన వీఆర్‌ఏగా నియమించారు.

ప్రైవేట్ స్కూల్స్‌ల్లో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యా హక్కు చట్టం –2019 ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించనున్నట్లు బాపులపాడు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ పేర్కొన్నారు. స్థానిక మహాత్మగాంధీనగర్‌లోని మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఆయన ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం పొందే పేద విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించాల్సి ఉంటుందని చెప్పారు. అనాథ పిల్లలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు ఐదు శాతం, ఎస్సీ విద్యార్థులకు 10 శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ విద్యార్థులకు ఆరు శాతం చొప్పున సీట్లు కేటాయిస్తామని వివరించారు. విధిగా ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఈ నిబంధనలను పాటించాల్సిందేనని ఆదేశించారు. పలువురు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేత సిద్ధార్థ కళాశాల జట్టు



ఉయ్యూరు: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఆటల పోటీల్లో సాఫ్ట్ బాల్ విభాగంలో ఉయ్యూరు ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల జట్టు విజయం సాధించింది. ఈ నెల 19, 20వ తేదీల్లో పోరంకిలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో అంతర్ కళాశాలల క్రీడలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఉయ్యూరు కళాశాల జట్టు ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం క్రీడాకారులను కళాశాల డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివనాథ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, పీడీ చంద్రబాబు అభినందించారు. వచ్చేనెల 4 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరు సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కృష్ణా యూనివర్సిటీ తరఫున క్రీడాకారులు కార్తీక్, సుభాష్, కుమార్ రాజా, వీరవాసు, గణేష్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.